# నమస్తే తెలంగాణ

# రంగారెడ్డి

I | హైదరాబాద్, సోమవారం 8 ఏప్రిల్ 2024 | RANGAREDDY


## టీ -హబ్‌లో యంగ్ ఎకో స్టార్టప్స్ కాన్‌ఫ్లుయెన్స్



సిటీబ్యూరో, ఏప్రిల్ 7 (నమస్తే తెలంగాణ): స్టార్టప్‌లను ఏర్పాటు చేసే యువతరాన్ని ప్రోత్సహించే లక్ష్యంతో టీ-హబ్ వినూత్న కార్యక్రమాలు చేపడుతున్నది. తాజాగా యంగ్ ఎకో స్టార్టప్స్ కాన్‌ఫ్లుయెన్స్ పేరుతో ఈనెల 28, 29 తేదీల్లో ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నది. సెంటర్ ఫర్ గ్లోబల్ అఫైర్స్ అండ్ పబ్లిక్ పాలసీ సహకారంతో ఆ ప్రోగ్రామ్‌ను నిర్వహిస్తున్నామని టీ హబ్ నిర్వాహకులు తెలిపారు. ఆసక్తి ఉన్న స్టార్టప్ వ్యవస్థాపకులు ఈ కింది లింకు ద్వారా https://bit.ly/3U2WKGr దరఖాస్తు చేసుకోవాలన్నారు.

## భానుడి కర్ఫ్యూ..

దక్షిణ, ఆగ్నేయ దిశల నుంచి తెలంగాణ వైపునకు వీస్తున్న కిందిస్థాయి గాలుల ప్రభావంతో ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో భానుడు తన ప్రతాపాన్ని చూపిస్తున్నాడు. గత కొన్ని రోజులుగా 41– 43 డిగ్రీల మధ్య గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. కాగా ఆదివారం గరిష్ఠంగా 42.8 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. ఎండల తీవ్రత కారణంగా మధ్యాహ్నం సమయంలో జనం బయటికి వచ్చేందుకు జంకుతున్నారు. దీనివల్ల మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 4 గంటల వరకు నగర రోడ్లన్నీ ఖాళీగా కనిపిస్తున్నాయి.



# ఫార్మాసిటీపై నీలినీడలు



యాచారం మండలంలోని మేడిపల్లిలో అర్ధాంతరంగా నిలిచిపోయిన రోడ్డు పనులు

- ఇప్పటికే పూర్తైన భూముల సేకరణ
- రైతులకు పరిహారం చెల్లింపు కూడా పూర్తి
- టీఎస్‌ఐఐసీ ఆధ్వర్యంలో చురుగ్గా సాగిన రోడ్ల నిర్మాణం
- కానీ.. ప్రభుత్వం మారడంతో స్తంభించిన పనులు
- అయోమయంలో భూములిచ్చిన అన్నదాతలు
- దిక్కుతోచని స్థితిలో రియల్ వ్యాపారులు, ప్లాట్లను కొన్న ప్రజలు

ఇబ్రహీంపట్నం, ఏప్రిల్ 7 : గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం రంగారెడ్డి జిల్లాలో ఏర్పాటు చేయతలపెట్టిన ఫార్మాసిటీపై నీలినీడలు కమ్ముకున్నాయి. ఫార్మాసిటీ ఏర్పాటుతో ఈ ప్రాంతానికి అనేక ఫార్మారంగ సంస్థలు రావడంతోపాటు ఎంతో అభివృద్ధి జరుగుతుందన్న సదుద్దేశంతో యాచారం, కందుకూరు మండలాల శివారులో ఫార్మాసిటీని గత ప్రభుత్వం ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ఇందుకోసం యాచారం మండలంలోని మేడిపల్లి, నానక్‌నగర్, కుర్మిద్ద, తాటిపర్తి గ్రామాలతోపాటు కందుకూరు మండలంలోని ముచ్చర్ల, మీర్‌ఖాన్‌పేట తదితర గ్రామాల్లోని 19,330 ఎకరాల భూమిని సేకరించాలని నిర్ణయించి.. యాచారం మండలంలోని నాలుగు వేల ఎకరాల అసైన్డ్ భూములను సేకరించింది. అలాగే ఆరువేల ఎకరాల పట్టా భూముల్లో నాలుగు వేల ఎకరాలను.. మిగతా భూములను కందుకూరు మండలంలోని పలు గ్రామాల నుంచి సేకరించింది. ఇందుకోసం రైతులకు అసైన్డ్ భూములకు ఎకరానికి రూ.7.80 లక్షలు, పట్టా భూములకు రూ.16 లక్షల చొప్పున నష్టపరిహారాన్నీ చెల్లించింది. భూములు కోల్పోయిన రైతులకు పరిహారంతోపాటు ఎకరానికి 120 గజాల చొప్పున ఇండ్ల స్థలాలను కూడా కేసీఆర్ ప్రభుత్వం కేటాయించింది. దీంతో ఈ ప్రాంతానికి చెందిన మెజార్టీ రైతులు పరిహారంతోపాటు ఇండ్ల పట్టాలను తీసుకున్నారు. దీంతో ఫార్మాసిటీ ఏర్పాటు చేయాలనుకున్న స్థలంలో టీఎస్‌ఐఐసీ ఆధ్వర్యంలో రోడ్లను ఏర్పాటుచేసి ఫార్మా సంస్థలకు భూములను కేటాయించేందుకు రంగం సిద్ధం కాగా..

గతేడాది జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ప్రభుత్వం మారడంతో ఫార్మాసిటీ ఏర్పాటుపై నీలినీడలు కమ్ముకున్నాయి. తాము అధికారంలోకి వస్తే ఫార్మాసిటీని రద్దుచేస్తామని కాంగ్రెస్ పార్టీ ప్రకటించడంతో.. ఫార్మాసిటీకోసం భూములిచ్చిన గ్రామాల్లోని రైతులు ఆ పార్టీ ఇచ్చిన హామీని నమ్మి ఏకపక్షంగా అనుకూలంగా ఓట్లువేశారు. కాంగ్రెస్‌పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఫార్మాసిటీపై ఎలాంటి ప్రకటన చేయకపోగా భూములు కోల్పోయిన రైతులకు తిరిగి భూములిప్పిస్తామన్న హామీని కూడా మార్చిపోయింది. దీంతో ఫార్మా ప్రగతి అక్కడే ఆడిపోయింది. మరోవైపు భూములిచ్చిన రైతులు తమ భూములు తమకు వస్తాయో లేదో అన్న అయోమయంలో ఉన్నారు.

### సీఎం ప్రకటనతో నిలిచిన పనులు

బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఏర్పాటు చేయ తలపెట్టిన ఫార్మాసిటీ ప్రాంతంలో మెగా టౌన్‌షిప్‌ను నిర్మిస్తామని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించటంతో ఫార్మాసిటీ ఏర్పాటుపై నీళ్లు చల్లినట్లైంది. అభివృద్ధి పనులు ఎక్కడికక్కడే నిలిచిపోయాయి. మరోవైపు ఫార్మాసిటీని రద్దుచేసి భూములు కోల్పోయిన రైతులకు తిరిగి ఇస్తామన్న ఆశలూ అండుగంటాయి. ఫార్మాసిటీ పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. తమ భూముల్లో టౌన్‌షిప్ నిర్మించడం ఏమిటని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### కుప్పకూలిన రియల్ ఎస్టేట్ రంగం..

యాచారం, కందుకూరు మండలాల పరిధిలో ఫార్మాసిటీని ఏర్పాటు చేస్తున్నట్లు గత ప్రభుత్వం ప్రకటించడంతో... నందివనపర్తి, నజ్దిక్‌సింగారం, కుర్మిద్ద, తాటిపర్తి, మేడిపల్లి, యాచారం తదితర గ్రామాల్లోని వేలాది ఎకరాలను రియల్‌ఎస్టేట్ వ్యాపారులు కొని ప్లాట్లుగా మార్చారు. మరోవైపు ఫార్మా అనుబంధ సంస్థల ప్రతినిధులూ భూములను కొనుగోలు చేసి అభివృద్ధి చేశారు. ఇప్పటికే పలు వ్యాపార సంస్థలు ఫార్మాసిటీ పేరు చెప్పి వేలాది ఎకరాల్లో ఏర్పాటు చేసిన ప్లాట్లను కూడా విక్రయించాయి. అయితే ఆ ప్రాంతంలో ఫార్మాసిటీ ఏర్పాటు కావడంలేదని తెలియడంతో ప్లాట్లు కొనుగోలు చేసిన ప్రజలు, రియల్‌ఎస్టేట్ వ్యాపారులు నెత్తినోరు కొట్టుకుంటున్నారు. ఇబ్రహీంపట్నం మండలంలోని ఆదిబట్ల గ్రామంలో ఏర్పాటు చేసిన టీసీఎస్ తరహాలోనే ఫార్మాసిటీని ఏర్పాటు చేస్తే ఈ ప్రాంతం ఎంతో అభివృద్ధి చెందుతుందన్న ముందుచూపుతో గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఫార్మాసిటీ ఏర్పాటుకు చర్యలు తీసుకున్నది. ఫార్మాసిటీకి అనుబంధంగా మేడిపల్లిలో ఇప్పటికే గ్రీన్‌ఫార్మాసిటీ పోలీసుస్టేషన్ కూడా ఏర్పాటైంది.



సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ పార్టీ చేవెళ్ల అభ్యర్థి కాసాని, చిత్రంలో ఎమ్మెల్యే గాంధీ

# 13న బీఆర్‌ఎస్ బహిరంగ సభ

- చేవెళ్ల సభకు లక్షలాదిగా తరలిరావాలి
- ఎంపీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ , ఎమ్మెల్యే గాంధీ

మియాపూర్ , ఏప్రిల్ 7 : చేవెళ్లలో ఈనెల 13న జరుగనున్న బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ భారీ బహిరంగసభను విజయవంతం చేయాలని శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ, చేవెళ్ల ఎంపీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఆదివారం ఎమ్మెల్యే తన నివాసంలో కార్పొరేటర్లు హమీద్‌పటేల్, రాగం నాగేందర్‌యాదవ్, జూపల్లి సత్యనారాయణ, నార్నె శ్రీనివాస్‌రావు, ఉప్పలపాటి శ్రీకాంత్, మాధవరం రోజాదేవి, మాజీ కార్పొరేటర్లు సాయిబాబా, రంగారావు, డివిజన్ పార్టీ అధ్యక్షులు, అభ్యర్థి కాసానితో కలిసి సమీక్ష నిర్వహించారు.

ఈ సందర్భంగా కాసాని జ్ఞానేశ్వర్ మాట్లాడుతూ గతంలో ప్రజా ప్రతినిధిగా ప్రజలకు సేవ చేసిన అనుభవం తనకున్నదని, తనను ఎంపీగా గెలిపిస్తే అన్ని వర్గాలకు అండగా ఉంటానన్నారు. అనంతరం ఎమ్మెల్యే గాంధీ మాట్లాడుతూ ఎంపీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్‌ను గెలిపించుకుంటామని ముక్త కంఠంతో ప్రజాప్రతినిధులు, ప్రజలు చెబుతున్నారన్నారు. ఆయన గెలుపునకు పార్టీ శ్రేణులు సైనికుల్లా కృషి చేయాలని, కాంగ్రెస్ బీజేపీల వైఫల్యాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లి.. వారికి వివరించి మద్దతును కూడగట్టాలని కోరారు. ఈ నెల 13న కేసీఆర్ సభకు లక్షలాదిగా ప్రజలు తరలిరావాలని పిలుపునిచ్చారు.

కార్యక్రమంలో మోహన్‌గౌడ్, గణేశ్ ముదిరాజ్, సంజీవరెడ్డి, రఘునాథ్‌రెడ్డి, శ్రీనివాస్‌యాదవ్, గౌతంగౌడ్, కిరణ్‌యాదవ్, రాజునాయక్, లక్ష్మీనారాయణ, భాస్కర్, హరీశ్‌రావు, పెద్ద భాస్కర్‌రావు, లక్ష్మారెడ్డి, గంగాధర్, భిక్షపతి, రాజేందర్, వేణు, గణేశ్, కాశీనాథ్, శ్రీను, చంద్రిక తదితరులు పాల్గొన్నారు.



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న సిబ్బంది(ఫైల్)

# రోడ్లపై చెత్త వేయొద్దు

- వంద శాతం చెత్త సేకరణకు వీక్లీ యాక్షన్ ప్లాన్‌ను అమలు చేస్తున్న జీహెచ్‌ఎంసీ
- చెత్త కుప్పలను తగ్గించడం, స్వచ్ఛ ఆటోలకు వ్యర్థాలను ఇచ్చేలా క్యాంపెయిన్

సిటీబ్యూరో, ఏప్రిల్ 7 (నమస్తే తెలంగాణ) : వందకు వంద శాతం ఇంటింటి చెత్త సేకరణే లక్ష్యంగా జీహెచ్‌ఎంసీ కమిషనర్ రొనాల్డ్ రాస్ ప్రత్యేక కార్యాచరణ అమలు చేస్తున్నారు. చెత్త రహిత నగరంగా తీర్చిదిద్దే చర్యల్లో భాగంగా తరచూ చెత్త వేసే ప్రాంతాల (గార్బేజీ వనరేబుల్ పాయింట్లు/జీవీపీ)పై యాక్షన్ ప్లాన్ రూపొందిస్తున్నారు. గ్రేటర్‌లో డస్ట్‌బిన్లు ఎత్తివేసి.. స్వచ్ఛ ఆటోల ద్వారా ఇంటింటి చెత్తను సేకరిస్తుండగా.. అక్కడక్కడ కొందరు బహిరంగంగానే చెత్త వేస్తున్నారు. ఈ నేపథ్యంలో చెత్తకుప్పలను తగ్గించడం, ప్రతి ఒక్కరూ వ్యర్థాలను స్వచ్ఛ ఆటోలకు ఇచ్చేలా అవగాహన కల్పించేందుకు బస్తీ కార్యాచరణను అమలు చేస్తున్నారు. వారం రోజుల యాక్షన్ ప్లాన్‌లో బస్తీ సమావేశాలు, స్వచ్ఛ ఆటోలకు చెత్త ఇవ్వని గృహాలు, బస్తీల్లో ర్యాలీలు, అవగాహన కార్యక్రమాలు, తరచూ చెత్త వేసే ప్రాంతాల్లో చెత్త మళ్లీ వేయకుండా రంగోళి (ముగ్గులు), టౌన్ వెండింగ్ కమిటీ మీటింగ్, ప్రతిజ్ఞ కార్యక్రమాలు చేపట్టారు. ఈ క్రమంలోనే వారం రోజుల బస్తీ కార్యాచరణతో ఫిర్యాదులను స్వీకరించారు. క్షేత్రస్థాయి సమావేశాలతో 1,87,752 ఇండ్ల యజమానులు స్వచ్ఛ ఆటోలకు చెత్త ఇవ్వట్లేదని తేలిందని కమిషనర్ రొనాల్డ్ రాస్ పేర్కొన్నారు. వారితో మాట్లాడి 1.4 లక్షల ఇండ్లకు స్వచ్ఛ ఆటోలతో అనుసంధానం చేశామని, వారం రోజుల్లో 863 ర్యాలీలు నిర్వహించినట్లు తెలిపారు. ఇంటింటి చెత్త సేకరణను 100శాతం సక్సెస్ చేయాలని.. స్వచ్ఛ ఆటోలకు చెత్త ఇవ్వకుండా రోడ్లపై పడేస్తే జరిమానా తప్పదని హెచ్చరించారు.

# పారదర్శకంగా..

## ధాన్యం కొనుగోలులో ఐరిస్ విధానం అమలు

- దళారీ వ్యవస్థ కట్టడితోపాటు మోసాలను అరికట్టేందుకు ..
- ఈ యాసంగి సీజన్ నుంచే ఇంప్లిమెంట్
- ఇప్పటికే కొనుగోలు కేంద్రాల నిర్వాహకులకు శిక్షణ పూర్తి
- పరికరాలు అందజేత
- వికారాబాద్ జిల్లాలోని 122 కొనుగోలు కేంద్రాలు

బొంరాస్‌పేట, ఏప్రిల్ 7 : ధాన్యం కొనుగోళ్లలో పారదర్శకత తీసుకొచ్చేందుకు ప్రభుత్వం సిద్ధమైనది. దళారీ వ్యవస్థను కట్టడి చేయడంతోపాటు మోసాలను అరికట్టేందుకు పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నది. ఈ ఏడాది యాసంగి ధాన్యం కొనుగోళ్లలో ఐరిస్(కనుపాపలతో గుర్తింపు) విధానాన్ని అమలు చేయాలని పౌరసరఫరాల శాఖ అధికారులు నిర్ణయించారు. ఇప్పటివరకు ఆధార్ అనుసంధానం, ఓటీపీ విధానం ద్వారా ధాన్యాన్ని కొనుగోలు చేస్తున్నారు. తాజాగా ఈ రెండింటితోపాటు ఐరిష్ విధానాన్ని కూడా ఇంప్లిమెంట్ చేయనున్నారు.

### అక్రమాలను అరికట్టేందుకు..

ఇప్పటివరకు రైతుల ఆధార్, బ్యాంకు ఖాతాల నంబర్లను ట్యాబ్‌లో ఎంట్రీ చేయగానే అన్నదాతల మొబైల్ ఫోన్లకు ఓటీపీ వచ్చేది. ఆ ఓటీపీని ట్యాబ్‌లో నమోదు చేసి రైతులు కొనుగోలు కేంద్రాలకు తీసుకొచ్చిన ధాన్యాన్ని నిర్వాహకులు తూకం చేసేవారు. దీనిని ఆసరాగా చేసుకుని కొందరు దళారులు, వ్యాపారులు రైతుల వద్ద తక్కువ ధరకు వరి పంటను కొని.. కొనుగోలు కేంద్రాలకు తీసుకొచ్చి సంబంధిత రైతుల పేర్లపైనే ఆ ధాన్యాన్ని విక్రయించి మద్దతు ధరను పొందుతూ సొమ్ముచేసుకుంటున్నారు. ఇలాంటి అక్రమాలను అరికట్టేందుకే ప్రభుత్వం ఈసారి యాసంగి సీజన్ నుంచి ఐరిస్ విధానాన్ని అమలు చేయాలని నిర్ణయించింది. దీంతో ధాన్యం విక్రయించే రైతు తప్పనిసరిగా కొనుగోలు కేంద్రానికి రావాల్సి ఉంటుంది. రైతు ఐరిష్ తీసుకున్న తర్వాతే ధాన్యాన్ని తూకం వేస్తారు. ఈ విధానంపై కొనుగోలు కేంద్రాల నిర్వాహకులకు ఇప్పటికే పౌరసరఫరాల శాఖ అధికారులు శిక్షణ ఇచ్చి ఐరిష్ పరికరాలను కూడా అందించారు.

### కౌలు రైతులకూ మేలు..

కౌలు రైతులు కూడా ఐరిస్ విధానంలో ధాన్యాన్ని అమ్ముకునే వెసులుబాటును ప్రభుత్వం కల్పించింది. కౌలు రైతులు మొదట ఏఈవోలను కలిసి ఎవరి భూమిని కౌలుకు తీసుకున్నారో వారి వివరాలను నమోదు చేయించాలి. ఈ వివరాలను ఏఈవోలు ఓపీఎంఎస్(ఆన్‌లైన్ ప్రొక్యూర్‌మెంట్ మేనేజ్‌మెంట్ సిస్టం)లో ఎంట్రీ చేస్తారు. దీంతో కౌలు రైతులు కూడా తాము పండించిన ధాన్యాన్ని వారే విక్రయించుకోవచ్చు.

### ధాన్యం కొనుగోలులో ఐరిస్ విధానం

ఈ యాసంగి సీజన్ నుంచే ధాన్యం కొనుగోలులో ఐరిస్ విధానాన్ని అమలు చేస్తున్నాం. దీనిని ఎలా చేయాలో కొనుగోలు కేంద్రాల నిర్వాహకులకు ఇప్పటికే శిక్షణ ఇచ్చి ఐరిస్ పరికరాలను కూడా అందజేశాం. ఈ విధానం వల్ల ధాన్యం కొనుగోళ్లను పారదర్శకంగా చేపట్టొచ్చు. అక్రమాలను అరికట్టొచ్చు.

–రాజేశ్వరరావు,
వికారాబాద్ డీఎస్‌వో





### జిల్లాలో 122 కొనుగోలు కేంద్రాలు

వికారాబాద్ జిల్లాలో ఈ యాసంగి సీజన్‌లో 122 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని అధికారులు నిర్ణయించారు. ధాన్యం దిగుబడిని బట్టి ఈ సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉన్నది. రైతులు ఈ యాసంగి సీజన్‌లో 85 వేల ఎకరాల్లో వరి పంటను సాగు చేయగా 1.19 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని అధికారులు అంచనా వేస్తున్నారు.

# శరవేగంగా..

- ఊపందుకున్న కోకాపేట ఓఆర్ఆర్ ట్రంపెట్ నిర్మాణం
- త్వరలో అందుబాటులోకి మరో ఇంటర్‌ఛేంజ్



సిటీబ్యూరో, ఏప్రిల్ 7 (నమస్తే తెలంగాణ): ఐటీ కారిడార్‌లో గత కేసీఆర్ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి ఫలాలు ఒక్కొక్కటిగా అందుబాటులోకి వస్తున్నాయి. ఐటీ కారిడార్‌ను ప్రపంచ స్థాయి ప్రమాణాలతో తీర్చిదిద్దే క్రమంలో గత కేసీఆర్ ప్రభుత్వం కోకాపేటలో సుమారు 534 ఎకరాల విస్తీర్ణంలో కోకాపేట నియోపోలిస్ లేఅవుట్‌ను హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ (హెచ్‌ఎండీఏ) చేపట్టింది. ఇందులో భాగంగానే కోకాపేట నియోపోలిస్ లేఅవుట్‌ను అనుసంధానం చేస్తూ నిర్మిస్తున్న ఓఆర్ఆర్ ట్రంపెట్ పనులు చివరి దశలో ఉన్నాయి. ఐటీ కారిడార్‌లో అత్యాధునిక మౌలిక వసతుల అభివృద్ధి చేసిన లేఅవుట్‌లో ఇప్పటికే భారీ బహుళ అంతస్థుల నిర్మాణాలు మొదలయ్యాయి. దానికి అనుగుణంగానే లేఅవుట్‌లో రోడ్డు, డ్రైనేజీ, మంచినీరు, విద్యుత్, వీధిదీపాలు, ల్యాండ్ స్కేపింగ్ వంటి పనులను కాంట్రాక్టు సంస్థ పూర్తి చేసింది. ఇదే లేవుట్‌ను కలుపుతూ ఔటర్ రింగు రోడ్డు మీదకు నేరుగా వెళ్లేందుకు, వచ్చేందుకు ఓఆర్ఆర్‌పై ట్రంపెట్ నిర్మాణం చేపట్టింది హెచ్‌ఎండీఏ. ట్రంపెట్ నిర్మాణం పనులు తుది దశలో ఉన్నాయి. త్వరలోనే బ్రిడ్జి నిర్మాణ పనులను పూర్తి చేసి అందుబాటులోకి తీసుకువచ్చేందుకు కృషి చేస్తున్నామని హెచ్‌ఎండీఏ అధికారులు తెలిపారు. కొత్తగా అభివృద్ధి ఐటీ కారిడార్‌లో ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా ఉండేందుకు విశాలమైన రోడ్లు, అనుసంధాన రోడ్లను నిర్మిస్తున్నామని అధికారులు తెలిపారు. ముఖ్యంగా కోకాపేట నియోపోలిస్ లేఅవుట్‌లో 50 నుంచి 60 అంతస్తులతో కూడిన ఆకాశహర్మ్యాలే అధికంగా నిర్మాణం అవుతున్న నేపథ్యంలో ట్రాఫిక్ ఇబ్బందుల లేకుండా ఉండేందుకు ఓఆర్ఆర్ నుంచి శంషాబాద్ విమానాశ్రయం వైపు సాఫీగా వాహనాలు వెళ్లేందుకు వీలుగా ఈ ట్రంపెట్‌ను నిర్మిస్తున్నామని, త్వరలోనే నిర్మాణం పనులు పూర్తి చేసి అందుబాటులోకి తీసుకువస్తామని అధికారులు తెలిపారు.

# మెట్రో రైల్లో రాయితీలకు కోత

- వీకెండ్, సెలవు రోజుల్లో 10 శాతం రాయితీ ఎత్తివేత
- అన్నింటికీ కోతలు పెట్టిన ఎల్ అండ్ టీ మెట్రో
- భారంగా మారిన మెట్రో ప్రయాణం



సిటీబ్యూరో, ఏప్రిల్ 7 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్ మహానగరంలో ప్రజా రవాణా వ్యవస్థల్లో అత్యంత కీలకమైనది మెట్రోరైలు. ఆర్టీసీ బస్సులు, ఎంఎంటీఎస్ రైళ్లు ఉన్నా, మెట్రోరైలు ప్రయాణం మాత్రం ఎంతో ప్రత్యేకత అనేలా ఉంటుంది. అలాంటి మెట్రోలో నగరవాసులు ప్రయాణించాలంటే భారంగా భావిస్తున్నారు. ఆదరణ పొందిన ప్రజా రవాణాను మరింతగా ప్రజలకు అందుబాటులోకి తీసుకెళ్లాల్సిన ఎల్‌అండ్‌టీ మెట్రో సంస్థ రాయితీలకు కోత విధిస్తున్నది. నగరంలో మెట్రో ప్రయాణం అంటే కాస్త ప్రియమే అయినా, నిర్ణీత సమయంలో నిర్దేశిత గమ్యస్థానానికి చేర్చుతు న్నది. అలాంటి మెట్రోను ఎక్కువమంది ప్రయాణికులకు అందుబాటులో ఉంచాల్సిన సంస్థ దూరం చేసేలా వ్యవహరిస్తున్నదన్న ఆరోపణలున్నాయి. ఇప్పటివరకు సెలవు రోజుల్లో హైదరాబాద్ మెట్రోరైలులో ప్రయాణించేందుకు సూపర్ సేవర్ ఆఫర్ ఉండేది. ఏడాదిలో నిర్ణయించిన 100 సెలవుల్లో ప్రయాణం చేసేందుకు వీలుగా సూపర్ సేవర్ కార్డును మెట్రో అధికారులు తీసుకొచ్చారు. రూ.59 సెలవు రోజుల్లో 57 మెట్రో స్టేషన్ల పరిధిలో ఎంత సమయమైనా తిరిగే అవకాశం కల్పించారు. ప్రస్తుతం ఈ ఆఫర్ మెట్రో ప్రయాణికులకు అందుబాటులో లేదు. అదే విధంగా 10 శాతం రాయితీతో కూడిన మెట్రో సువర్ణ ఆఫర్‌ను కూడా ఎత్తివేసింది. ప్రస్తుతం ఎలాంటి టికెట్ రాయితీ ఆఫర్లు మెట్రోలో లేకపోవడంతో ప్రయాణికులు టికెట్ చార్జీలను భారంగా భావిస్తున్నారు.